క్లుప్తంగా

వివరాలు నమోదు చేయించుకోవాలి


మత్స్యకారులకు సూచనలిస్తున్న డార్విన్

చీరాల టౌన్: సముద్రంలో వేట చేస్తూ జీవనం సాగించే మత్స్యకారులు విధిగా తమ వివరాలను నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్‌ఫాం (ఎన్ఎఫ్‌డీపీ)లో నమోదు చేసుకోవాలని వాడరేవు గ్రామ మత్స్య సహాయకులు డార్విన్ సూచించారు. బుధవారం మండలంలోని వాడరేవు గ్రామంలోని మత్స్యకారులకు ఎన్ఎఫ్‌డీపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేట తప్ప మరో పని తెలియని మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తోందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేట సాగించే సమయంలో రక్షణ పరికరాలను వినియోగించాలన్నారు. మత్స్యకార సొసైటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ కనెక్షన్‌లు ఇస్తాం


వైదనలో మాట్లాడుతున్న ఈఈ మస్తాన్‌రావు

బల్లికురవ: గ్రామాల వారీగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు కొత్త లైన్‌లు.. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మించి.. త్వరితగతిన సరఫరా ఇవ్వనున్నట్లు ఈఈ ఎస్. మస్తాన్‌రావు తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని వైదన ముక్తేశ్వరం, సూరేపల్లి గ్రామాల్లో రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ కనెక్షన్‌లకు ఎంతమంది రైతులు దరఖాస్తు చేశారు. ఇంకా ఎంతమందికి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉందని తెలుసుకున్నారు. పగటిపూటే 9 గంటల సరఫరా ఇస్తామన్నారు. విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బిల్లులు సకాలంలో చెల్లించాలని తెలిపారు. ఏడీఈ యం. సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక


మొక్కలు నాటుతున్న సీడీపీఓ కృష్ణకుమారి

అద్దంకి: సాక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాలుగా మండలంలోని బొమ్మనంపాడు, చెరువుకొమ్ముపాలెం గ్రామం ఎంపికైనట్లు కొరిశపాడు సెక్టార్ సీడీపీవో కృష్ణకుమారి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. సూపర్‌వైజర్లు ఇందిర, రమాదేవి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ప్రయాణం ఓ సాహసం



ఈపురుపాలెం రైల్వేస్టేషన్


టికెట్ కౌంటర్‌కు దూరంగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

- ఈపురుపాలెం స్టేషన్‌లో సమస్యలు
- దూరంగా టికెట్ కౌంటర్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

చీరాల టౌన్: చేనేతలు, వ్యవసాయ కూలీలు, వివిధ ప్రాంతాలకు రోజూ వెళ్లి వచ్చే ఉద్యోగులతో ఈపురుపాలెం రైల్వే స్టేషన్ రద్దీగా ఉటుంది. ఈ గ్రామంలో రోజుకు ఎనిమిది రైళ్లు ఆగుతాయి. చెన్నై, విజయవాడ రెండు మార్గాల్లో కీలకమైన స్టేషన్. చీరాల రూరల్ మండలంలోని ఎన్నో గ్రామాల్లోని ప్రజలకు విజయవాడ, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు వెళ్లేందుకు అనువైన స్టేషన్ ఇదే. అయితే ఈ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరణ చేశారే కానీ అది ప్రజలకు ఏ మాత్రం అందుబాటులోకి రాలేదు. అటు టికెట్ తీసుకునేందు.. ఇటు రైలు ఎక్కేందుకు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకెళితే....చీరాల మండలంలోని ఈపురుపాలెం రైల్వేస్టేషన్‌కు ప్రత్యేకత ఉంది. ఇది ప్రయివేటు వ్యక్తులు నిర్వహించే స్టేషన్. ఈ స్టేషన్ నుంచి ప్రతి రోజూ విజయవాడకు నాలుగు, గూడూరు, బిట్రగుంటకు నాలుగు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈపురుపాలెం స్టేషన్ నుంచి మేజర్ గ్రామమైన ఈపురుపాలెం, తోటవారిపాలెం, బోయినవారిపాలెం, పిట్టువారిపాలెం, సాయికాలనీ, గవినివారిపాలెం గ్రామాల నుంచి రోజు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక వ్యవసాయ సీజన్‌లో వందలాది మంది వ్యవసాయ కూలీలు ఈపురుపాలెం నుంచి తెనాలి వరకు, ఒంగోలు వరకు వ్యవసాయ పనులకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల ఈ రైల్వేస్టేషన్‌లో కేంద్రం మూడో రైల్వేలైన్ ఏర్పాటు చేస్తూ నూతన టికెట్ కౌంటర్, ప్రయాణికులకు కావాల్సిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేసింది. ఇక్కడే అసలు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎక్కడైనా టికెట్ కౌంటర్‌కు దగ్గర్లోనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉంటుంది. కానీ ఈ స్టేషన్లో మాత్రం టికెట్ కౌంటర్ బోయినవారిపాలెం వైపు ఉంటే.. ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మాత్రం సావరపాలెం వైపు 100 మీటర్ల దూరంలో ఉంది. ఫలితంగా ఉదయం వేళల్లో ట్రైన్ ఎక్కేందుకు వచ్చిన ప్రయాణికులు అటు టికెట్ తీసుకుని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై నుంచి వచ్చి ప్లాట్‌ఫాంకు చేరుకునే లోపు రైలు స్టేషన్‌ను వదలి వెళ్లిపోతోంది. అలానే ఉదయం వేళల్లో విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు రైలు ఎక్కేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్లాట్ ఫాం ఎత్తుగా లేకపోవడంతో రైలు ఎక్కేందుకు పిల్లలు, మహిళలు, వృద్ధులు అవకాశంలేక ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ ప్రయాణాలు చేస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి ప్లాట్ ఫాం ఎత్తు పెంచి ప్రయాణాలకు అనువుగా ఏర్పాటు చేయడంతో పాటుగా స్టేషన్ పరిసరాల్లో లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇక్కడ లైట్లు సక్రమంగా లేకపోవడంతో మద్యం తాగేవారు, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడేవారికి ఆవాసంగా మారుతోంది. దీంతో రాత్రివేళల్లో ఈపురుపాలెం స్టేషన్లో దిగాల్సిన ప్రయాణికులు చీరాల్లో దిగి.. బస్సులు, ఆటోల్లో ఇంటికి చేరుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి స్టేషన్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.


ఎత్తులేకుండా ఉన్న విజయవాడ వైపు వెళ్లే ప్లాట్ ఫాం

సలహాలతో అధిక దిగుబడి


అద్దంకి: మాట్లాడుతున్న ఏఓ వెంకట కృష్ణ


యర్రబాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ శ్రీనివాసరావు


కూకట్లపల్లిలో వరి పొలాన్ని పరిశీలించి సూచనలిస్తున్న కుమారి


వ్యవసాయాధికారి అంజిరెడ్డి

సంతమాగులూరు (అద్దంకి): వ్యవసాయాధికారుల సూచనలు సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి బి. అంజిరెడ్డి అన్నారు. ఏల్చూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగు చేసిన వరి, మిరప, పంటలను పరిశీలించారు. కాంప్లెక్స్ ఎరువులను దమ్ములో వేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ విస్తరణాధికారులు మాధురి, గౌస్, సుమంత్ పాల్గొన్నారు.

అద్దంకి: మినుములో పల్లాకు తెగులును గుర్తించకుంటే పంట నష్టం జరుగుతుందని ఏవో వెంకట కృష్ణ అన్నారు. రామాయపాలెం, తిమ్మాయపాలెం గ్రామాల్లో మినుము పొలాలను పరిశీలించి అందులో పల్లాకు తెగులు ఉన్నట్లు గుర్తించారు. పంట వేసిన తరువాత అప్పుడప్పుడు పరిశీలిస్తూ ఉండాలని చెప్పారు. ప్రస్తుతం పల్లాకు తెగులు కనిస్తోందని తెలిపారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: యర్రబాలెం గ్రామంలో ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ డీఏపీ, యూరియా ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో పొలంలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్ బి.నాగరాజు, పశుసంవర్ధక శాఖ ప్రతినిధి నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ: వరి పంటలో ఎరువుల యామాజన్యం ముఖ్యమైనదని ఏఓ కుమారి అన్నారు. కూకట్లపల్లి, గొర్రెపాడులో ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణ గురించి రైతులకు తెలియజేశారు. వంశి, వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, ప్రసన్న పశుసంవర్ధక సహాయకులు రాణి, శ్రావణి మార్కెటింగ్ సిబ్బంది సురేష్, గొర్రెపాడు గ్రామ సర్పంచ్ ముంద్రు దానయ్య, ఇప్పల అంజిరెడ్డి, లింగారెడ్డి, అంకిరెడ్డి పాల్గొన్నారు.

2030 నాటికి హెచ్ఐవీ నిర్మూలన


అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న స్వయం సహాయక బృందాలు

మార్టూరు: దశాబ్దాలుగా సమాజాన్ని పట్టిపీడిస్తున్న హెచ్ఐవీ- ఎయిడ్స్ వ్యాధిని 2030 నాటికి నిర్మూలించడం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధి కె. దుర్గ అన్నారు. మండలంలోని జొన్నతాళి గ్రామంలో బుధవారం మహిళా స్వయం సహాయక బృందాలతో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097 ను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా నిశ్శబ్దాన్ని ఛేదిద్దామని ఆమె పిలుపునిచ్చారు. మహిళా సంఘాలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు రూతు, సల్మా, ప్రమీల, రమ్య, సరోజిని అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఆర్ఎంపీ వైద్యుడు మనోహర్ పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు, షాడోస్ సిబ్బంది

చీరాల రూరల్: చిన్నపిల్లలను పనుల్లో పెట్టుకుని వారితో వెట్టిచాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కార్మికశాఖాధికారి రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలుదుకాణాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాల్లో బాల కార్మికులను గుర్తించేందుకు కార్మికశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. చదువు నేర్చుకోవాల్సిన చిన్న పిల్లలతో బలవంతంగా పనులు చేయించకూడదని తెలిపారు. షాడోస్ నిర్వాహకులు న్యాయవాది రాజా సాల్మన్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలకు, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పర్చూరు ఏఎల్‌వో అబ్రహం, షాడోస్ సిబ్బంది భాగ్యలక్ష్మి, ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్టుమెంట్ రాము, సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ విజయానంద్, కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాలపర్తి బాలకృష్ణ

మార్టూరు: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన స్థానిక జాతీయ రహదారిపై కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది వివరాల మేరకు.. యద్దనపూడి మండలం చింతపల్లి పాడు గ్రామానికి చెందిన పాలపర్తి బాలకృష్ణ బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద గల ఓ హోటల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకొని తన టీవీఎస్ వాహనంపై స్వగ్రామం వెళ్తున్న బాలకృష్ణను కోలలపూడి క్రాస్ రోడ్డు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అతని తల రోడ్డును ఢీ కొట్టి తీవ్ర గాయం అయింది. సమాచారం అందుకున్న హైవే మొబైల్ సిబ్బంది మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన చికిత్స తరలించారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి


కుంకలమర్రులో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అనిత

కుంకలమర్రు (కారంచేడు): సచివాలయల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధులను సక్రమంగా నిర్వహించడంతో పాటు ప్రజా సమస్యలపై స్పందించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ జి. అనిత అన్నారు. బుధవారం కుంకలమర్రులోని రెండు సచివాలయాలతో పాటు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, ఆధార్ సెంటర్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. ఆధార్ అప్‌డేట్‌ల కోసం, నూతన కార్డుల కోసం వచ్చే వారికి అందించాల్సిన సేవలను కూడా అడిగి తెలుసుకున్నారు.

సిమెంటు దిమ్మెను ఢీ కొన్న బైక్


గాయపడిన ఊసరపల్లి సురేష్

మేదరమెట్ల: మద్యం మత్తులో మోటారు బైకును సిమెంటు దిమ్మెకు ఢీ కొట్టిన ఘటన జాతీయ రహదారి వెంకటాపురం జంక్షన్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగింది. రేణింగివరం వైపు నుంచి ఒంగోలు వైపునకు మోటారు బైకుపై ఓ వ్యక్తి వస్తూ బైకు అదుపు తప్పి రోడ్డు మధ్యలో డివైడర్‌ల కోసం ఉంచిన సిమెంటు దిమ్మెను ఢీ కొన్నాడు. అతని తలకు తీవ్ర గాయాలు కాగా.. అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్దిపాడు మండలం నేలటూరు గ్రామం ఊసరపల్లి సురేష్‌గా పోలీసులు గుర్తించారు.

గ్రామ సభల్లో అర్జీల స్వీకరణ



పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలో గ్రామ సభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్


చినగంజాం మండలం గొనసపూడి గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు

పర్చూరు (చినగంజాం): మండలంలో గతంలో రీ సర్వే నిర్వహించిన అడుసుమల్లి గ్రామంలో బుధవారం 35 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య రెవెన్యూ గ్రామ సభలో తెలిపారు. భూ విస్తీర్ణంలో తేడాలున్నాయని 26 అర్జీలు, ఉమ్మడి భూ సమస్యలకు సంబంధించి 9 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎండీ అల్తాఫ్, గ్రామ ఉప సర్పంచ్ అడ్డగడ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ బాలాంజనేయులు, ఎంఆర్ఐ ప్రేమ్‌కుమార్, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం మండలంలో..

మండలంలోని గొనసపూడి గ్రామంలో రీ సర్వే పూర్తి చేసిన భూములకు సంబంధించి సమస్యలపై రైతుల నుంచి 105 అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. భూ విస్తీర్ణంలో తేడాలకు సంబంధించి 71 అర్జీలు, పేరు మార్పు కోసం 7 అర్జీలు, ఉమ్మడి భూ సమస్యలకు సంబంధించి 22, అర్జీలు, పాస్‌బుక్ కావాలంటూ 5 అర్జీలు రైతులనుండి అందినట్లు తెలిపారు.

ఇంకొల్లు మండలంలో..

మండలంలోని గంగవరం గ్రామంలో భూముల రీ సర్వే పూర్తి చేసుకున్న రైతుల నుంచి సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన గ్రామ సభలో 4 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. విస్తీర్ణంలో వ్యత్యాసాలు పరిష్కరించాలని 3 అర్జీలు, ఉమ్మడి భూ సమస్యకు సంబంధించి 1 అర్జీ అందినట్లు ఆయన తెలిపారు.

నేడు రెవెన్యూ గ్రామ సభ

వేటపాలెం: పందిళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ గ్రామ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు గ్రామ సభ కొనసాగుతోందని తెలిపారు. గ్రామంలో రిసర్వే నిర్వహించామని రీ సర్వేలో ఏమైనా తప్పులు జరిగి ఉంటే రైతులు గ్రామ సభలో వారి సమస్యల పరిష్కారం కోసం అర్జీలు దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామ సభను రైతులు సద్వినియోగించు కోవాలని సూచించారు.


ఇంకొల్లు మండలం గంగవరంలో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరత్నం

రీసర్వేపై నేడు గ్రామసభ

చీరాల టౌన్: పేరాల రెవెన్యూ గ్రామ పరిధిలో గతంలో భూములకు జరిగిన రీసర్వేకి సంబంధించి రైతులకు ఉన్న సమస్యలు, వాటి పరిష్కారంపై గురువారం ఉజిలీపేట వార్డు సచివాలయంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. రైతులంతా పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

మొక్కుబడి సమావేశం

- ప్రణాళికలు లేవు, తీర్మానాలూ లేవు
- ఇదీ సర్వసభ్య సమావేశం తీరు

జె.పంగులూరు: సర్వసభ్య సమావేశం పేరుకే గానీ.. దానివల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. గతంలో జరిగిన చర్చలు.. పనులపై ఎలాంటి పురోగతి లేకపోవడంపై అంతా పెదవి విరుస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య మావేశం జరిగింది. 21 గ్రామ పంచాయితీలకు గాను 4 గురు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. 13 మంది ఎంపీటీసీలకు గాను 7 మాత్రమే హాజరయ్యారు.

సమస్యలపై చర్చలు ఏవీ

మండలంలోని ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. విష జ్వరాలతో గ్రాస్తులు మంచానికే పరిమితమయ్యారు. కానీ ఎక్కడా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు. నెల రోజులు నుంచి కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. కానీ వ్యవసాయ శాఖ వారు ఇప్పటికీ పంట నష్టం అంచనా వేయలేదు. మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి మాత్రం గ్రామంలో మినుము పంట కేవలం 2000 వేల ఎకరాల్లోనే దెబ్బతిందని.. మిగిలిన పంటలు బాగున్నాయని చెబుతున్నారు. పంచాయితీ రాజ్ నుంచి 33 పనులకు గాను రూ. 3.30 కోట్లు మంజూరు అయినట్లు, ఉపాధి హామీ పథకం నుంచి 26 గోశాలలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. స్వరూపారాణి, తహసీల్దార్ సింగారావు, డిప్యూటీసీ రాయిణి ప్రమీల, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం అధికారులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యత



పర్చూరు: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకా ఆనందకుమారి

పర్చూరు (చినగంజాం): ఉపాధి హామీ పథకంలో మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణపు పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ మేకా ఆనందకుమారి కోరారు. పర్చూరు మండల ప్రజా పరిషత్ సర్వ సమావేశం బుధవారం పర్చూరులోని మండల విద్యావనరుల కేంద్రంలో ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, ఇంజనీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, గృహ నిర్మాణ శాఖ, రెవెన్యూ శాఖ, అంగన్‌వాడీ, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఎంపీటీసీలు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖాధికారులు సమాధానమిచ్చారు. చెరుకూరులో విద్యుత్ సమస్య, నాగులపాలెంలో మురుగు కాలువ సమస్య గురించి ప్రస్తావించడంతో అధికారులు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్, వైస్ ఎంపీపీ కోట ప్రసన్నకుమారి, కాలేషావలి, పాలేరు వీరయ్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు హాజరయ్యారు.

320 మంది స్వాములకు అన్నదానం


స్వాములకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం పాత గుంటూరు రోడ్డులో గల అయ్యప్ప స్వామి దేవస్థానంలో గణపతి మురుగన్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో 320 మంది అయ్యప్పలకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాఘవేంద్ర రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లు నిర్వాహకులు దాతలుగా వ్యవహరించారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆశ్వీయుజ మాసం పునర్వసు నక్షత్రం అష్టమి తిధి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

పోలియోపై నేడు అవగాహన

పర్చూరు (చినగంజాం): ప్రపంచ పోలియో దినోత్సవం పురస్కరించుకొని పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాల నుంచి బొమ్మల సెంటర్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించనున్నట్లు, అంతా పాల్గొనాలని కోరారు.